‘దుర్గం’పై మళ్లీ పాగా



- పల్లె, పట్టణం.. ఎక్కడికెళ్లినా ఫ్యాన్ గాలి !
- నిరాడంబరం, అందరిలో కలుపుగోలు తనం అభ్యర్థికే ప్లస్



కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య గెలుపుతో మరోమారు వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడనుంది. సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గాలి వీయనుంది. వివాద రహితుడు, ఉన్నత విద్యావంతుడు, నిత్యం ప్రజల్లో ఉండే ప్రజాప్రతినిధి, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉన్నతాధికారిగా పని చేసిన అనుభవంతోపాటు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనను మెచ్చిన ప్రజలు వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలని అనుకుంటున్నారు.

రూ.4 కోట్లతో మౌలిక వసతుల కల్పన:
కళ్యాణదుర్గం పార్టీ సమన్వయకర్తగా ఎంపిక చేసిన నాటి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య ఎంపీ నిధులతో సుమారు రూ. 4 కోట్లకు పైగా మౌలిక వసతులు కల్పించారు. ఏ వార్డు, ఏ గ్రామంలో సమస్య ఉన్నా వెంటనే నేరుగా వెళ్లి తనే పరిష్కరించడం గొప్ప విషయం. సమస్యలున్న ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించడం ఆయన నైజం.

ఐదేళ్లలో సంక్షేమానికి పెద్దపీట :
కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఐదేళ్లలో సుమారు రూ.4,127 కోట్లుకు పైగా నిధులు ప్రభుత్వం ఖర్చు చేసింది. సంక్షేమ పథకాల నగదును నేరుగా ఎలాంటి సిఫార్సు, మధ్యవర్తిత్వం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. మరోసారి సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే వైఎస్సార్ సీపీ తరఫున బరిలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలారి రంగయ్యను గెలిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందంటూ ప్రజలు అంటున్నారు.

ఉన్నత విద్యావంతుడు..
నిజమైన ప్రజా సేవకుడు :
కళ్యాణదుర్గం నియోజకవర్గం సార్వత్రిక ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులందరి కంటే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలారి రంగయ్య ఉన్నత విద్యావంతుడు. ఎంఎల్ఐసీ, ఎంఏ., పీహెచ్‌డీ చేసి నియోజకవర్గంలోని అన్ని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల కంటే ఉన్నత చదువులు చదివిన వ్యక్తిగా అందరిలో పేరుంది. తన ఎన్నికల అఫిడవిట్‌లో సైతం చదువు, తన కుటుంబ వివరాలతో పాటు తనపై ఒక్క కేసు కూడా లేదని నిరూపించుకున్నారు. ప్రజా సేవ చేయాలన్న తపన ఉన్న వ్యక్తిగా రంగయ్యకు పేరుంది.

నిరాడంబర మనస్తత్వం..
అందరిలో కలుపుగోలు తనం:
వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య ముక్కుసూటి మనిషి. ఏకష్టమొచ్చానా ప్రజలు కూడా నేరుగా ఆయన్ను కలిసే అవకాశం కల్పిస్తారు. అందరినీ ఒకేలా చూస్తూ, ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యారు. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని టీడీపీకి తెలిసిపోయింది. సైకిల్ గుర్తు కూడా కనిపించకుండా పోతుందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. గత ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎస్.రఘువీరారెడ్డి ఓటమి పాలయ్యాక, కాంగ్రెస్ పార్టీ కనుమరుగయ్యింది. చేసేదేమీలేక కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి లేరని భావించి రాంభూపాల్ రెడ్డి అనే వ్యక్తిని బరిలో దింపారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- డీఎస్పీ బి శ్రీనివాసులు



రాయదుర్గం: ప్రశాంత ఎన్నికలే లక్ష్యమని డీఎస్పీ బి. శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆయన చేపట్టిన భద్రతా చర్యలపై రాయదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 557 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. రాయదుర్గంలో 34, కళ్యాణదుర్గంలో 24 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సివిల్, హెచ్‌జీఎస్, ఏపీఎస్పీ, బీఎస్ఎఫ్ ప్రత్యేక బలగాలు 800 మంది విధుల్లో పాల్గొంటారన్నారు. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని పంపామన్నారు. ఎన్నికల వేళ అల్లర్లకు పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి, జైలుకు పంపుతామని డీఎస్పీ హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. రౌడీషీటర్లతోపాటు ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని నిందితులను ఇప్పటికే బైండోవర్ చేశామన్నారు. ఇప్పటి వరకు 107, 109, 110 సీఆర్‌పీసీ కింద 2,579 మందిని బైండోవర్ చేశామన్నారు. రెండు నియోజకవర్గాల్లోనూ లైసెన్స్‌డ్ ఆయుధాలు 70 ఉండగా, 61 ఆయుధాలను డిపాజిట్ చేశామన్నారు. మిగిలినవి బ్యాంకు ఉద్యోగుల వద్ద ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గానికి ఒక డీఎస్పీని ప్రత్యేక అధికారిగా ఎస్పీ నియమించారన్నారు. రాయదుర్గానికి తనను, కళ్యాణదుర్గానికి నరసింగప్ప ను ప్రత్యేకాధికారిగా నియమించారన్నారు.

రూ.1.64 కోట్ల నగదు సీజ్ : ఎన్నికల ప్రక్రియలో భాగంగా మద్యం, నగదు కట్టడికి కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 17 చెక్ పోస్టులు, ఆరు ఫ్లయింగ్ స్కాడ్ పరిధిలో ఇప్పటి వరకు రూ.1,64,77,420 కోట్ల నగదు సీజ్‌చేసినట్టు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. అలాగే 3,505.74 లీటర్ల మద్యం స్వాదీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎన్నికల నియామవళి ఉల్లఘించిన తొమ్మిది మంది పై కేసులు నమోదుచేసినట్టు వెల్లడించారు.

క్లుప్తంగా

ఆది శంకరాచార్యుల జయంతి



ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన శ్రీశారదా శంకరమఠంలో ఆదివారం ఆది జగద్గురు శంకరాచార్యుల జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేద పండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం స్వామికి మహాన్యాస పారాయణ, ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి పూజ, అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఉత్సవమూర్తిని మేళతాళాలతో శోభాయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో మహానివేదన, మంత్రపుష్పం, అష్టావధాన సేవ నిర్వహించారు.

ఎన్నికల్లో లైవ్ ట్రాకింగ్ సిస్టమ్

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో లైవ్ ట్రాకింగ్ సిస్టమ్‌ను వినియోగించనున్నట్లు ఆర్ఓ డాక్టర్ రాణి సుస్మిత తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలోని 261 పోలింగ్ కేంద్రాలకు గాను 25 రూట్లలో పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల తహసీల్దార్లు ఏఆర్ఓలుగా, కంట్రోల్ రూం సిబ్బంది 20 మంది, సాంకేతిక సిబ్బంది 15 మంది, పోలింగ్ ఆఫీసర్లు 261 మంది, ఏపీలో 261 మంది, ఓపీఓలు 1,044 మంది, వీడియోగ్రాఫర్లు 44 మంది, మైక్రో అబ్జర్వర్లు 45 మంది, సెక్టార్ ఆఫీసర్లు 25 మంది, రూట్ ఆఫీసర్లు 25 మంది, ఏఎస్ఎంలు 261 మంది, బీఎల్ఓలు 261 మంది, సెక్టార్ పోలీస్ అధికారులు 25 మంది, బీఈఎల్ ఇంజినీర్లు ముగ్గురు, సెక్షన్ సీఏపీఏఫ్‌లు ముగ్గురు చొప్పున పాల్గొననున్నట్లు ఆమె వివరించారు. ఎన్నికల కమిషన్ యాప్స్‌తో పాటు పీడీఎంఎస్, సమర్థ్ లాంటి అప్లికేషన్ల ద్వారా లైవ్ ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా సమావేశాల ఏర్పాటు

బొమ్మనహాళ్: టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా పార్టీల సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం బొమ్మనహాళ్ మండలంలోని ఎల్‌బీ నగర్ గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు దాదాపు 200 మంది నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం 6 గంటలకే ఎన్నికల ప్రచారాలు, సభలు ముగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఉన్నా యి. వాటిని పట్టించుకోకుండా టీడీపీ నాయకు లు బరితెగించి ఎల్‌బీ నగర్ గ్రామంలో భారీ స్థా యి లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. సోమవారం జరిగే పోలింగ్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎలా పని చేయాలని కాలవ శ్రీనివాసులు దిశా నిర్దేశం చేశారు. ఎన్ని కల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా సమావేశాలు నిర్వహించిన కాలవ శ్రీనివాసులుపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, పలువురు డిమాండ్ చేశారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలించిన జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, ఆర్ఓ డాక్టర్ రాణి సుస్మిత, డీఎస్పీ బి.శ్రీనివాసులు



ఎన్నికల విధులకు హాజరైన అధికారులు

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి

కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలో 261 బూత్‌లలో ఎన్నికల నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విడుదల చేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. కాగా, నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,30,785 మంది ఓటర్లు ఉండగా అందులో 1,14,356 మంది పురుష ఓటర్లు, 1,16,422 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ఏడుగురు ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా జెడ్పీ సీఈఓ: స్థానిక డిగ్రీ కళాశాలలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, ఆర్ఓ డాక్టర్ రాణి సుస్మిత, డీఎస్పీ బి.శ్రీనివాసులు ఆదివారం పరిశీలించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పీఓ, ఏపీఓ, ఓపీఓల వివరాలు, విధుల కేటాయింపు తదితర వాటిని నోటీస్ బోర్డులో ఉంచారు. ఉద్యోగులకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. కళాశాల ఆవరణలో బూత్‌ల వారీగా పీఓ, ఏపీఓ, ఓపీఓలు ఎన్నికల సామగ్రితో పాటు ఈవీఎంలను తీసుకెళ్లారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక






టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో పార్టీ నేతలు

కంబదూరు: మండలంలోని అండేపల్లికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఆదివారం రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, గాజుల రామాంజనేయులు, సచివాలయ కన్వీనర్ రమేష్ ఆధ్వర్యంలో ఉప్పెర మచ్చ వెంకటేశులు,వడ్డే పరంధామ, కురుబ శివ అనే టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. వీరికి నాయకులు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామరెడ్డి, కేశులప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం:మండలంలోని బుడిమేపల్లికి చెందిన టీడీపీకి చెందిన నాయకులు ఉప్పర రామాంజనేయులు, ఉప్పర బసవరాజు అనే ఇద్దరు టీడీపీని వీడి ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు వారికి కండువాకప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు పాలవెంకటాపురం మాజీ సర్పంచ్ నరసింహులు, ఇస్మాయిల్ , మర్రిస్వామి, శివన్న, లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అధికారం కాదు.. అభివృద్ధే అజెండా

- ‘సాక్షి’ ఇంటర్వ్యూలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య



కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధే అజెండాగా, ప్రజా సేవే పరమావధిగా పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య చెప్తున్నారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో విజయం సాధిస్తానని, నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, నియోజకవర్గం రూపు రేఖలు మారుస్తానని ఆదివారం ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

సాక్షి: కళ్యాణదుర్గం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

రంగయ్య: గత 20 ఏళ్లుగా జిల్లా ప్రజలతో పాటు కళ్యాణదుర్గం నియోజకవర్గం ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయి. గతంలో డీఆర్‌డీఏ పీడీగా, డ్వామాలో పని చేసిన అనుభవం ఉంది. ఇక్కడి ప్రజల కష్టాలు, పేద ప్రజల జీవితాలపై స్పష్టంగా అధ్యయనం చేశా. నియోజకవర్గంలో ఉన్న సమస్యలు, వాటిని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తా.

సాక్షి: రైతుల శ్రేయస్సుకు తీసుకునే చర్యలు?

రంగయ్య: కార్మికులు, కర్షకులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులకు అందరికీ అండగా ఉంటా. తన వద్దకు ఎవరు ఏ పని కోసం వచ్చినా, వారి సమస్య తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తా. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే వ్యాపార వర్గాలకు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తా. ఇదివరకే రైతుల శ్రేయస్సు కోసం అనంతపురం జిల్లా నుంచి కిసాన్ రైలు ప్రారంభించా. ఇక్కడి రైతులు పండించిన ఉద్యాన పంటలను నేరుగా రైతులే ఢిల్లీ మార్కెట్‌లో అమ్ముకునే విధంగా వెసులుబాటు కల్పించా.

సాక్షి: ఎంపీగా మీరు చేసిన అభివృద్ధి ...

రంగయ్య: అధికారిగా కంటే..ప్రజాప్రతినిధిగా ప్రజలకు దగ్గరగా మరింత సేవ చేయొచ్చనుకున్నా. ఉన్నతోద్యోగం చేస్తూ, 16 ఏళ్లసర్వీసు ఉండగా, స్వచ్ఛంద పదవీ విరమణ చేశా. 2019లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు ఎంపీగా అవకాశం కల్పించారు. అదే నమ్మకంతో ప్రజలు గెలిపించారు. ఐదేళ్లలో జిల్లాలో వేల కోట్లు ఖర్చు చేసి, పలు అభివృద్ధి పనులు చేయించా.

సాక్షి: నియోజకవర్గ అభివృద్ధికి మీరు చేసిందేమిటి?

రంగయ్య: కళ్యాణదుర్గం నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా వచ్చిన అనతి కాలంలోనే ప్రజా అవసరాలైన శ్మశాన వాటికలు, కమ్యూనిటీ భవనాలు, కల్వర్టులు, డ్రైనేజీ, తాగునీరు వంటి ప్రధాన మౌలిక వసతుల కోసం 71 పనులకు రూ.4.18 కోట్లు ఎంపీ నిధుల నుంచి మంజూరు చేశా. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం మెరుగు, వీధిలైట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చి, పనులు పూర్తి చేయించా. వీటితో పాటు స్వచ్ఛాంధ్ర స్కీం ద్వారా 16 శానిటరీ పనులకు రూ.1.30 కోట్లు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా రైల్వే లైన్ డెవలప్‌మెంట్ వర్కుల కోసం కేంద్ర రైల్వేశాఖ మంత్రి ద్వారా రూ.250 కోట్ల పనులు జరుగుతున్నాయి.

సాక్షి: ఎమ్మెల్యేగా గెలిపిస్తే మొదటి ప్రాధాన్యత ఏది?

రంగయ్య : ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే గెలిపిస్తే కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతా. అక్కచెల్లెమ్మలు ఏ ఒక్కరూ తాగునీటి కోసం బిందెలు పట్టుకొని పొలాలు, బోరుబావుల వద్దకు వెళ్లనవసరం లేకుండా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయిస్తా.

సాక్షి: బీటీపీ పూర్తికి మీరు తీసుకునే చర్యలు?

రంగయ్య : నియోజకవర్గంలో రైతులకు తలమానికంగా ఉన్న బీటీపీ ప్రాజెక్టును పూర్తి చేయిస్తాం. కాలువలు తవ్వి నియోజకవర్గంలోని 114 చెరువులకు తాగు, సాగు నీరందిస్తాం.

సాక్షి: గ్రామీణ ప్రాంత రోడ్లు అభివృద్ధి చేస్తారా?


రంగయ్య: ముఖ్యంగా రవాణా వ్యవస్థను పటిష్టం చేసేలా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లను బాగు చేయిస్తా. దీంతో పల్లెల నుంచి పట్టణాలకు సులభంగా రవాణా సౌకర్యం ఉంటుంది.

సాక్షి: విద్యావంతుడిగా నిరుద్యోగ యువతకు మీరిచ్చే భరోసా

రంగయ్య: ఇక్కడి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు విరివిగా కల్పిస్తాం. యువత కోసం పరిశ్రమలు తీసుకొచ్చి స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం. అందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తాం.

మంచితనమే విజయానికి తొలి‘మెట్టు’

- గెలుపుపై వైఎస్సార్‌సీపీ ధీమా
- అభివృద్ధి, సంక్షేమమే పార్టీ గెలుపునకు బలం అంటున్న కేడర్



రాయదుర్గం: రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించనుంది. ఇప్పటి వరకు జరిగిన సర్వేలన్నీ ‘ఫ్యాన్’కే అనుకూలంగా వెలువడ్డాయి.

ఇదే ఊపును వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి గెలుపుదిశగా మలుచుకున్నారు. రెండు నెలల నుంచి నియోజకవర్గం వ్యాప్తంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన మెట్టు.. అన్ని వర్గాల ప్రజలనూ ఆకట్టుకున్నారు. గడిచిన 58 నెలల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపైనా ఇంటింటా ప్రచారం చేశారు. నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ.3 వేల కోట్లు పేదల బ్యాంకు ఖాతాలకే జమ చేసినట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా గెలిస్తే రాబోవు ఐదేళ్లలో చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమం పై ప్రజలకు ముందే తెలియజేశారు. దీనికి తోడు టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులుతో పోలిస్తే మెట్టు గోవిందరెడ్డి మృదుస్వభావి, మంచికి మారుపేరు, రాజకీయాల్లోనూ అనుభవం ఉన్న వ్యక్తిగా ప్రజల్లో గుర్తింపు ఉంది. ఎవరి నోట విన్నా మెట్టు మంచి తనంపైనే చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గా 11 ఏళ్లు, ఏపీఐఐసీ చైర్మన్ గా 4 ఏళ్లు కీలక పదవులు చేపట్టినా.. పైసా కూడా అవినీతికి ఆస్కారం లేకపోవడం ప్రజలకు బాగా నచ్చిన అంశం.

విజయఢంకా మోగించనున్న వైఎస్సార్‌సీపీ :
రాయదుర్గంలో ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగితే ఏకంగా 10 సార్లు కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించింది. ఆ తర్వాత అదే ఊపును వైఎస్సార్‌సీపీ అందుకోనుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఉప ఎన్నిలు కలుపుకొని సాధారణ ఎన్నికల్లో వైస్సార్‌సీపీ అభ్యర్థి మూడు పర్యాయాలు విజయం సాధించారు. వైఎస్సార్ సీపీ అంటేనే రాయదుర్గం కంచుకోటగా మారుతోంది. 2019 సాధారణ ఎన్నికల తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 99 శాతం అభ్యర్థులు విజయం సాధించారు. గడిచిన 58 నెలల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు విజయం దిశగా తీసుకెళ్లనున్నాయి. టీడీపీ అని చెప్పుకునే నాయకులకు సైతం పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది. మహిళలు, యువత, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు ఇలా అన్నివర్గాలకూ మేలు చేకూరింది. ఈ పరిణామాలన్నీ మెట్టు గోవిందరెడ్డి విజయానికి కలిసిరానున్నాయి. దీంతోపాటు మేధావులు, రాజకీయ విశ్లేషకులంతా సోమవారం జరగనున్న పోలింగ్ లోనూ ఫ్యాన్ ప్రభంజనం తథ్యమని భావిస్తున్నారు. గెలుపై మెట్టు సైతం ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎదురీదుతున్న తెలుగుదేశం పార్టీ..
రాయదుర్గంలో గ్రూపు తగాదాలు, పార్టీకి సీనియర్లు దూరం కావడం తదితర వ్యతిరేకాంశాలతో ఈ ఎన్నికల్లో టీడీపీ ఎదురీదుతోంది. ఆపార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు వైఎస్సార్ సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డిని తట్టుకొని నిలబడడం సాధ్యం కాదని ప్రజలు అంటున్నారు.



దీనికి తోడు 2014-19 మధ్య కాలంలో ఇదే కూటమితో జతకట్టిన టీడీపీ సంకీర్ణ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా గెలిచి ప్రభుత్వ చీఫ్ విప్, మంత్రిగా పదవులు అనుభవించినా ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్న అపవాదు ప్రజల్లో మూటకట్టుకున్నారు. దీన్ని పదేపదే ఎత్తిచూపడంలోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు సఫలీకృతులయ్యారు. ఇసుక, మట్టి, నీరు–చెట్టు లాంటి వాటిల్లో తెలుగు తమ్ముళ్లు చేసిన దోపిడీ కూడా ప్రజలకు గుర్తుంది. ఇది వాస్తవమే అన్నట్టు ఆనాడు ‘ఈనాడు’లోనే ‘మంత్రి ఇలాకాలో కంత్రీల కులాసా’ అంటూ వార్త కథనం ప్రచురితమైన విషయం అందరికీ తెలిసిందే.

‘సార్వత్రిక’ సమరం..సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం వెల్లడి
- ప్రశాంత వాతావరణంలో ఓటేసేలా ఏర్పాట్లు
- సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలు



రాయదుర్గం: పోలింగ్ సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, జెడ్పీ సీఈఓ నిదియాదేవి, ఆర్ఓ కరుణకుమారి

రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికలు వచ్చాయంటే పండగ వాతావరణం ఉన్నట్లే.. ఊరూరా సందడి. అధికారులు, సిబ్బంది హడావుడి. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి రాజకీయనేతలు, అభ్యర్థుల్లోనూ ఆందోళన ఓ వైపు, ప్రచారాల హోరు మరో వైపు . ఇలా ఎన్నికల వేడితో రెండు నెలలు గడిచిపోయాయి. నేడు ఓటర్లు తుది తీర్పు ఇచ్చే రోజొచ్చింది. శనివారం సాయత్రం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ముగిసినప్పటి నుంచి నియోజకవర్గంలో నిశబ్ద వాతావరణం నెలకొంది. పట్టణంలోని ఆదర్శ పాఠశాల వద్ద ఆదివారం ఉదయం నుంచి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ సందడి మొదలైంది. సామగ్రి అందుకున్న సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

296 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ : నియోజకవర్గంలోని అర్బన్ సహా, డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో 296 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 13 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, 2,64,352 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల విధుల్లో 296 మంది పీఓలు, 296 మంది ఏపీఓలు, 888 మంది ఓపీఓలు పాల్గొననున్నారు. మొత్తం 32 రూట్లు ఏర్పాట్లు చేశారు.

జెడ్పీ సీఈఓ పరిశీలన: ఎన్నికల సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలని జెడ్పీ సీఈఓ నిదియాదేవి ఆదేశించారు. ఆదివారం ఆర్ఓ కరుణకుమారి, డీఎస్పీ బీ శ్రీనివాసులతో కలిసి ఎన్నికల సామగ్రి పంపిణీకి ముందు ఈవీఎం, వీవీ ప్యాట్, ఇతర సామగ్రిని పరిశీలించారు. సుమారు 300 మందితో పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలు - ఓటర్ల వివరాలు

మండలం	కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డి హీరేహాళ్	43	18,386	18,463	04	36,853
బొమ్మనహాళ్	58	23,209	23,458	13	46,680
కణేకల్లు	63	26,130	26,887	06	53,023
రాయదుర్గం రూరల్	39	17,160	17,385	03	34,548
రాయదుర్గం అర్బన్	48	25,808	27,615	16	53,439
గుమ్మఘట్ట	45	20,101	19,708	0	39,809
మొత్తం	296	1,30,794	1,33,516	42	2,64,352



రాయదుర్గం: సామగ్రి పంపిణీ కేంద్రంలో సిబ్బంది



రాయదుర్గం: ఈవీఎంలు తీసుకువస్తున్న ఎన్నికల సిబ్బంది



రాయదుర్గం: ఈవీఎం,వీవీప్యాట్, ఇతర సామగ్రిని బస్సులో ఎక్కిస్తున్న దృశ్యం



రాయదుర్గం: కల్యంలో ఓటువేసేందుకు సిద్ధం చేసిన బారికేడ్లు